నేడు సీపీ బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్‌గా శంక బ్రత బాగ్చి సోమవారం ఉదయం ఏడు గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నట్టు కమిషనరేట్ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. బాగ్చీ నియామకంతో అవినీతి, విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిలో గుబులు మొదలయిందంటున్నారు. ముక్కుసూటి అధికారిగా గుర్తింపున్న బాగ్చీ అవినీతి, అక్రమాలను సహించరని, విధుల్లో నిర్లక్ష్యం చూపేవారిపై కఠినంగా వ్యవహరిస్తారని, ఒత్తిళ్లు వచ్చినా వెనక్కితగ్గరనే ప్రచారంతో నగరానికి రావాలనుకున్న కొందరు సీఐలు ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది.

విద్యార్థులపై ఫీజుల భారం!

భారీగా పెంచేసిన ప్రైవేటు పాఠశాలలు

- కొన్ని పాఠశాలల్లో 20 నుంచి 30 శాతం పెంపు
- యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫాం వ్యాపారం
- కనిపించని అధికారుల పర్యవేక్షణ
- పట్టించుకోని విద్యాశాఖ యంత్రాంగం





విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):

'ద్వారకానగర్ ప్రాంతంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో తన కుమారుడికి గత ఏడాది ఆరో తరగతికి రూ.35వేలు ఫీజు చెల్లించాం. ఈ ఏడాది తమ బంధువు కుమారుడు అడ్మిషన్ తీసుకున్నారు. ఆరో తరగతికి ఫీజు రూ.52 వేలు అని చెప్పడంతో ఏడాదిలో ఇంత తేడా ఎందుకని ప్రశ్నిస్తే.. ఫీజులు పెంచాం.. కట్టాల్సిందేనని కరాఖండీగా చెప్పేశారు.'

- ఓ విద్యార్థి తండ్రి ఆవేదన...

నగరంలో ప్రైవేటు పాఠశాలలు అడ్డగోలుగా ఫీజులు పెంచేశాయి. ముఖ్యంగా కార్పొరేట్, సీబీఎస్ఈ/ఐసీఎస్‌సీ సిలబస్, ఐఐటీ/నీట్ ఫౌండేషన్ కోర్సులు బోధించే పాఠశాలలు ఏకంగా 20 నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంపుదల చేశాయి. తల్లిదండ్రుల బలహీనతను సొమ్ము చేసుకునేలా కొన్ని పాఠశాలలు వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సామాన్య కుటుంబీకులు తమ పిల్లలను ఇటువంటి పాఠశాలల్లో చదివించాలంటే ఏడాదికి ఇద్దరికి ఫీజుల కోసం రూ.లక్షకుపైగా చెల్లించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇంకా పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, నోట్సుల కొనుగోలుకు మరో రూ.50వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. దీనికి తోడు బస్సు కోసం రూ.వేలు తీసుకుంటున్నారు. ఒకవేళ ఏసీ సదుపాయం ఉంటే ఫీజు ఒక్కటే రూ.లక్షల్లో ఉంటుంది. ఇటువంటి స్కూళ్లు నగర శివారుల్లోనే ఎక్కువగా ఉన్నాయి.



జిల్లాలో 1,389 పాఠశాలలుండగా అందులో 780 ప్రైవేటు స్కూళ్లున్నాయి. గత విద్యాసంవత్సరంలో జిల్లాలో ఒకటోతరగతి నుంచి పదో తరగతి వరకు 3.9 లక్షల మంది విద్యారులున్నారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 90వేలమంది చేరగా, మూడు లక్షల మంది ప్రైవేటు పాఠశాలల్లో చదివారు. ఈ ఏడాది ఎక్కువమంది ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు పెంచేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా పుస్తకాల వ్యాపారం..

జిల్లాలో మెజారిటీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు సంబంధిత స్కూలు ఆవరణలోనే పుస్తకాల వ్యాపారం చేస్తున్నాయి. నోట్సు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ (ఇష్టం లేకపోయినా ఒత్తిడి తెచ్చి కొనిపిస్తారు) విక్రయిస్తున్నారు. స్టేట్, సీబీఎస్ఈ సిలబస్ పాఠ్య పుస్తకాలు మాత్రం బహిరంగ మార్కెట్‌లో కొనుక్కోవాలని చెబుతున్నారు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు యూనిఫాం కూడా విక్రయిస్తుండగా, మరికొందరు నగరంలో కొన్ని ఎంపికచేసిన దుకాణాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. నగరంలో కార్పొరేట్ స్కూలులో తొమ్మిదో తరగతి విద్యార్థికి అవసరమైన నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌కు రూ.5,500 చెల్లించామని, పాఠ్యపుస్తకాలకు మరో రూ.1100 ఖర్చు చేశామని ఓ విద్యార్థి తండ్రి ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి ఏటా విద్యార్థి తరగతిని బట్టి పాఠశాలకు ట్యూషన్ ఫీజు చెల్లించినా, మళ్లీ స్టడీ మెటీరియల్ ఎందుకని ప్రశ్నిస్తే కనీసం సమాధానం ఇచ్చేందుకు కూడా నిరాకరిస్తున్నారని అతను ఆరోపించారు.

ఫీజుల నియంత్రణ కమిటీ ఏదీ?

జిల్లా స్థాయిలో ఫీజుల వసూళ్లకు కలెక్టర్ నేతృత్వంలో కమిటీ ఉంటుంది. ఏయే తరగతి విద్యార్థికి ఎంత ఫీజు వసూలు చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఖరారుచేసి ఉత్తర్వులు ఇస్తే జిల్లాస్థాయిలో దానిని అమలుచేయాల్సింది ఈ కమిటీయే. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఫీజుల వ్యవహారంపై ఇంకా దృష్టిసారించలేదు. ఈలోగా పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమై ప్రైవేటు పాఠశాలల ఫీజులు ఖరారుచేసి జిల్లాలకు ఆదేశాలివ్వాలి. ఇదిలావుండగా జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ప్రైవేటు పాఠశాలల ఫీజులపై దృష్టిసారించడంలేదనే విమర్శలున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రైవేటు పాఠశాలల ఫీజులపై సంబంధిత యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి, గట్టిగా హెచ్చరికలు జారీచేసి ఉంటే ఫలితం ఉండేదని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఇంకా జిల్లాలో ప్రైవేటు పాఠశాలల గుర్తింపు కోసం ఇటీవల నోటీసులు జారీచేశారు. అయితే గుర్తింపు మంజూరుకు పలువురు మండల విద్యాశాఖాధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో తమ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వసూళ్లపై వారు దృష్టిసారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడే పింఛన్ల పండగ

ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

- జిల్లాలో **1,65,432** మంది లబ్ధిదారులు
- ఉదయం 6 గంటలకే ప్రారంభం
- ఇంటింటికీ వెళ్లి అందించనున్న సచివాలయ సిబ్బంది
- పాల్గొననున్న ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభంకానున్నది. జిల్లాలో 1,65,432 మందికి రూ.65 కోట్లు అందజేసేందుకు రంగం సిద్ధమయింది. వీటిలో 11 కేటగిరీల పింఛన్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీమేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.మూడు వేలు, జూలైలో పెంచిన రూ.నాలుగువేలు వెరసి రూ.ఏడువేల చొప్పున అందజేయనున్నారు. దివ్యాంగులకు రూ.ఆరువేలు, అనారోగ్య కారణాలతో బాధపడుతున్న కొన్ని కేటగిరీలకు రూ.15వేలు, మరికొన్ని కేటగిరీలలో రూ.10వేలు అందజేస్తారు. అధికారికంగా ఒక చోట పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టకపోయినా ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులు, ఇతర కేటగిరీ వర్గాల వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తారు. ఉదయం ఆరుగంటల నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో గ్రామ/వార్డు సచివాలయ కార్యదర్శులకు శనివారమే పింఛన్ మొత్తం అందజేశారు. సగటున ఒక కార్యదర్శికి 50 పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించారు. బయోమెట్రిక్, ఐరిస్ యంత్రాలు ఇవ్వడంతోపాటు వీధుల్లో పింఛన్‌దారుల జాబితా ఇచ్చారు. పింఛన్ల పంపిణీపై జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.



ఇప్పటికే జీవీఎంసీ అధికారులతో పాటు నాలుగు గ్రామీణ మండలాల ఎంపీడీవోలకు ఆదేశాలు జారీచేసింది. ఈ ఏడాది మార్చి వరకు వలంటీర్లు పింఛన్లు అందజేసేవారు. ఎన్నికల సమయంలో మూడు నెలల పాటు గత ప్రభుత్వం నిర్వాకంతో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. దీనిని పరిగణనలో తీసుకున్న కూటమి ప్రభుత్వం అప్రమత్తమై గతంలో మాదిరిగానే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను సచివాలయ సిబ్బందికి అందజేయడంతో వారు వలంటీర్ల నుంచి సమాచారం తీసుకున్నారు. గ్రామ/వార్డు సచివాలయ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయనుండగా కూటమి నేతలు వారి వెంట వెళ్లనున్నారు. జిల్లాలో మొత్తం 1,65,432 మందికి పలు రకాల పింఛన్లు పంపిణీ చేస్తారు. అత్యధికంగా 74,198 మందికి వృద్ధాప్య పింఛన్లు రూ.7 వేల చొప్పున అందజేస్తారు. 54,565 మంది వితంతువులు, 21,660 మంది దివ్యాంగులు, 6,852 మంది ఒంటరి మహిళలు, 2,586 మంది మత్స్యకారులు, 1,777 మంది అభయహస్తం లబ్ధిదారులున్నారు. అనారోగ్య కారణాలతో బాధపడే వారు 1,152 మందితోపాటు ఇతర కేటగిరీలకు చెందిన వారికి పెంచిన మొత్తం మేరకు పింఛన్లు అందిస్తారు.

రాయలసీమ బోణీ

ప్రారంభమైన ఏపీఎల్ సీజన్ -3

- వార్త 4లో



రాయలసీమ కింగ్స్ - కోస్టల్ రైడర్స్ మధ్య మ్యాచ్

అరకు కాఫీ అమోఘం

- అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన జీసీసీకి ప్రధాని ప్రశంసలు
- మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావన
- ఆనందం వ్యక్తం చేసిన జీసీసీ ఎండీ సురేశ్‌కుమార్

విశాఖపట్నం, జూన్ 30: అరకు కాఫీ రుచి అమోఘమని, కాఫీకి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడంలో విశేష కృషిచేస్తున్న జీసీసీ సేవలు అభినందనీయమని ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఆయన దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా మన్యం ప్రాంతంలో జీసీసీ, ఏపీ ప్రభుత్వం సహకారంతో గిరిజనులు సాగు చేస్తున్న అరకువ్యాలీ కాఫీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మన దేశ ఉత్పత్తులు ప్రపంచస్థాయి గుర్తింపు సాధిస్తుండడం భారతీయులంతా గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలో గిరిజనులు అధిక విస్తీర్ణంలో కాఫీ పంట సాగు చేస్తున్నారని, శ్రేష్ఠమైన అరోమా రుచి కలిగిన అరకు కాఫీ మంచి గుర్తింపు పొందిందన్నారు. 1.50 లక్షల ఆదివాసీ కుటుంబాలు అరకు కాఫీ సాగు, ఉత్పత్తి, విక్రయాలతో ఆర్థిక సాధికారత సాధిస్తున్నారని కొనియాడారు. గతంలో విశాఖను సందర్శించినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి ... మిగతా 4వ పేజీలో



సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి 2016లో అరకు కాఫీ రుచి చూస్తున్న ప్రధాని మోదీ (ఫైల్ ఫొటో)

సంక్షేమానికి పూర్వ వైభవం!

వైసీపీ హయాంలో బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలు నిర్వీర్యం

- టీడీపీ హయాంలో ఆయా కార్పొరేషన్ల ద్వారా పెద్దఎత్తున సాయం
- సబ్సిడీపై రుణాలు, 'ఆదరణ' కింద పరికరాలు పంపిణీ
- తాజాగా కూటమి అధికారంలోకి రావడంతో పథకాలన్నీ పునఃప్రారంభమవుతాయని ఆశలు



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం కింద లబ్ధిదారుడికి ఆటో అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో సంక్షేమం పట్టాలెక్కనుంది. బీసీ, ఎస్సీ, మైనారిటీలకు ఆర్థికంగా, సామాజికంగా భరోసా కల్పించేందుకు, ఆయా సామాజికవర్గాల యువతకు ఉపాధి చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోబోతోంది. వారికి రాయితీ రుణాలు అందించి ప్రోత్సహించేందుకు ఏర్పాటుచేసిన సంక్షేమ శాఖలు గడిచిన ఐదేళ్లలో పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. ఈ శాఖలకు జగన్ ప్రభుత్వ హయాంలో పని లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంక్షేమ శాఖలకు ఊపిరిలూదుతారనే ఆశలు రేకెత్తుతున్నాయి.

తెలుగుదేశం అధికారంలో ఉండగా 'ఆదరణ' పథకం ప్రవేశపెట్టి కులవృత్తుల వారికి నాణ్యమైన పరికరాలను, సబ్సిడీతో కూడిన రుణాలను అందించింది. కాగా జగన్ ప్రభుత్వం ఆయా వర్గాలను పూర్తిగా విస్మరించింది. ఆదరణ లాంటి పథకాలను ఎత్తివేసింది. సంక్షేమ శాఖలను నిర్వీర్యం చేసింది. ఈ నేపథ్యంతో తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఆయా పథకాలను పునఃప్రారంభిస్తామని చంద్రబాబు ప్రకటించారు. తాజాగా కూటమి అధికారంలోకి రావడంతో ఆయా వర్గాల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. గతంలో చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉండగా వందలాది మందికి సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ... మిగతా 4వ పేజీలో

రెచ్చిపోతున్న బైక్ రేసర్లు

వారాంతాల్లో విచ్చలవిడిగా పోటీలు

సోషల్‌మీడియా గ్రూపుల్లో ముందస్తు సమాచారం

- ఎంపిక చేసినచోట యథేచ్ఛగా నిర్వహణ
- ప్రధాన రోడ్లు, కూడళ్లలో ప్రమాదకరంగా స్కిట్‌లు
- శనివారం రాత్రి బీచ్‌రోడ్డులో హల్‌చల్
- బెంబేలెత్తిపోయిన సందర్శకులు
- కొరవడిన పోలీసుల నిఘా



శనివారం రాత్రి బీచ్‌రోడ్డులో వందలాది వాహనాలతో రేసింగ్ చేస్తున్న యువత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో బైక్‌రేసర్లు రెచ్చిపోతున్నారు. వారాంతంలో వందలాది వాహనాలతో ప్రమాదకరమైన స్కిట్లు, స్పీడ్ రేసింగ్‌లతో హడలెత్తిస్తున్నారు. ఒక్కో బైక్‌పై ముగ్గురు, నలుగురు కూర్చొని మరీ జిగ్‌జాగ్ చేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే ఇతర వాహనాల చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటివరకు నగర శివారు ప్రాంతాల్లో గుట్టుగా జరిగే రేసింగ్‌లు కొద్ది రోజులుగా నగరం నడిబొడ్డున, ముఖ్య కూడళ్లకు పాకాయి. దీనిపై ఫోన్‌చేసి సమాచారం ఇస్తేనే గానీ గుర్తించలేని నిద్రావస్థలో పోలీసు యంత్రాంగం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో విద్యార్థులు, ఉద్యోగులైన యువత బైక్ రేసింగ్‌లకు దిగుతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టా, ట్విటర్‌లో గ్రూప్‌లను ఏర్పాటుచేసుకుని దీనికి సంబంధించిన సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నారు. చాలా కాలంగా నగరంలో రేసింగ్‌లు జరుగుతున్నప్పటికీ ఇటీవల ఇది మరింత ఎక్కువయిది., బైక్ రేసింగ్‌కారణంగా యువత ప్రమాదాలకు గురై మృత్యువాతపడుతున్నారు. దీంతో బైక్‌రేసింగ్‌లపై పోలీసులు కొన్నాళ్ల కిందట వరకూ కఠినంగా వ్యవహరించేవారు. బైక్‌రేసింగ్‌లు జరుగుతున్న ప్రాంతాలు, రేసింగ్‌లకు పాల్పడుతున్న యువతను గుర్తించి నిఘా పెట్టేవారు. వారాంతాల్లో ప్రత్యేకంగా పికెట్‌లు ఏర్పాటు చేసి నిఘా పెట్టేవారు. అయినప్పటికీ రేసర్లు అదనుచూసి తమ బ్యాచ్‌తో ఏర్పాటుచేసుకున్న సోషల్‌మీడియా గ్రూపుల్లో ... మిగతా 4వ పేజీలో

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

కంచరపాలెం, జూన్ 30: జీవీఎంసీ పరిధి 47, 48, 54, 55, 56 వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఈ పింఛన్లను స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల సమక్షంలో సచివాలయాల సిబ్బంది అందజేయనున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, గీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి కొత్తగా పెంచిన పింఛన్లను అందజేయనున్నారు. ఈ పంపిణీలో ఆయా వార్డుల నాయకులు సహకారం అందించనున్నారు.

ఆస్పత్రికి మతిస్థిమితంలేని వ్యక్తి తరలింపు

డాబాగార్డెన్స్, జూన్ 30: మానసిక ఆరోగ్య స్థితి బాగోలేక రోడ్డుపై తిరుగుతున్న వ్యక్తిని గుర్తించి విశాఖ మానసిక వైద్యాలయంలో చికిత్స నిమిత్తం చేర్పించినట్టు ఏయూటీడీ సెక్రటరీ వాసు తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఇచ్చిన సమాచారం మేరకు రోడ్డుపై తిరుగుతున్న ఆ వ్యక్తిని పట్టుకుని ఏయూటీడీ భీమ్‌నగర్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించామన్నారు. అనంతరం ఆయన మానసిక పరిస్థితి బాగోలేదని గుర్తించిన మానసిక వైద్యాలయంలో చికిత్స నిమిత్తం చేర్పించినట్టు పేర్కొన్నారు.

'ఆప్సా' అధ్యక్షుడు సోమశేఖర్ సేవలు చిరస్మరణీయం


సోమశేఖర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మహారాణిపేట, జూన్ 30: విశాఖ జిల్లా ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ (అప్సా) అధ్యక్షుడిగా సోమశేఖర్ అందించిన సేవలు చిరస్మరణీయమని అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె. రామకృష్ణ కొనియాడారు. ఇటీవల సోమశేఖర్ ఆకస్మిక మృతి చెందటంతో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు సోమశేఖర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్, శ్రీనివాసరావు, అజయ్, గోవింద్ తదితరులతో పాటు, రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాలకు చెందిన ప్రతినిధులు, జిల్లాలోని పలు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నిరుపయోగంగా మారిన డెబ్రిస్ లిఫ్టింగ్ యంత్రం


ఆర్‌అండ్‌బీ యార్డు వద్ద నిలిచిన వ్యర్థాలు

మూన్నాళ్ల ముచ్చటేనా..?

- జ్ఞానాపురంలో పనిచేయని ఆటోమెటిక్ డెబ్రిస్ లిఫ్టింగ్ యంత్రం
- నాలుగు నెలల వ్యవధిలో మూలకు..
- రూ.1.89 కోట్లు బూడిదలో పోసిన పన్నీరైన వైనం
- యథావిధిగా లారీల్లో లోడింగ్.. జీవీఎంసీపై అదనపు భారం

జ్ఞానాపురం, జూన్ 30: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాలనీలు ముంపునకు లోనుకాకుండా ఎర్రిగెడ్డలో చెత్త తొలగించేందుకు ఆర్‌అండ్‌బీయార్డు వద్ద ఏర్పాటు చేసిన పవర్ ఆపరేటెడ్ మెకానికల్ ఎస్కలేటర్ యంత్రాలు (ఆటోమెటిక్ డెబ్రిస్ లిఫ్టింగ్ యంత్రం) మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు మార్చి 9వ తేదీన ఆర్‌అండ్‌బీ యార్డు వద్ద జీవీఎంసీ అధికారులు అప్పటి ఎమ్మెల్యే, వార్డు కార్పొరేటర్ ఒత్తిళ్లకు తలొగ్గి ఆదరాబాదరాగా రూ.1.89 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన ఈ యంత్రాలను ప్రారంభించారు. నాలుగునెలలు గడవకముందే ఈ యంత్రాలు పనిచేయడం మానేశాయి. ఎర్రిగెడ్డలో చెత్తా చెదారాలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు ట్రక్కుల్లో లోడు చేసేవిధంగా స్టెయిన్‌లెస్ స్టీల్ మెటీరియల్‌తో చేసిన ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేశారు. ఇది ప్రస్తుతం పనిచేయకపోవడంతో మళ్లీ అధిక వ్యయం వెచ్చించి జేసీబీల సాయంతో వ్యర్థాలను తొలగింపు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈ ప్రాంత వాసుల్లో పారిశుధ్యంపై ఆందోళన నెలకొంది. రూ. కోట్లు వెచ్చించిన యంత్రం ఎప్పటికప్పుడు చెత్త తొలగింపునకు ఉపయోగకరంగా ఉంటుందనుకుంటే ఏ మాత్రం ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. జీవీఎంసీ అధికారులకు ఏమాత్రం ముందు చూపు లేకపోవడంతో దాదాపు రూ. 2 కోట్ల ప్రజాధనంతో కొనుగోలుచేసిన ఈ యంత్రాల మూలకు చేరినట్టు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలు పనిచేయకపోవడంతో ఆర్‌అండ్‌బీ యార్డు వద్ద పెద్ద ఎత్తున వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. వాటిని జేసీబీ సాయంతో లారీల్లో లోడ్ చేయడానికి రూ. 1500 చొప్పున చెల్లించి తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజాధనం వృథా కాకుండా ఎస్కలేటర్ వినియోగంలోకి తేవాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.


చెత్త తొలగింపునకు పాతపద్ధతిలో జేసీబీ వినియోగం

కుసుమ హరనాథ నామ సంకీర్తనలు

డాబాగార్డెన్స్, జూన్ 30: డాబాగార్డెన్స్‌లోని శ్రీ కుసుమ హరనాథ మందిరం ప్రాంగణంలో నామ సంకీర్తనా కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు శ్రీ కుసుమహరనాథ సంకీర్తనలు గానం చేశారు. అనంతరం ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ మాట్లాడుతూ, భగవన్నామ సంకీర్తన చేసిన వారికి మానసిక ప్రశాంతతతోపాటు ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బి. శివసీతారాం, సాయిరాం, హరి, హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు సన్మానం


ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుని సన్మానిస్తున్న ఔం శ్రీయుగ సెంటర్ ప్రతినిధులు

సీతమ్మధార, జూన్ 30: సీతమ్మధారలోని ఔం శ్రీ యుగ సెంటర్ ప్రతినిధులు ఉత్తర నియోజకవర్గ శాసన సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పి. విష్ణుకుమార్‌రాజును సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఔం యుగ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కనకమహాలక్ష్మి ఆలయం అభివృద్ధికి విరాళం


ఆలయ ఈఓకు చెక్ అందజేస్తున్న కిశోర్

జగదాంబ కూడలి, జూన్ 30: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం అభివృద్ధికి నగరానికి చెందిన కేదార్ శెట్టి కిశోర్ రూ. 1,11,116లను విరాళంగా అందించారు. ఆదివారం దేవదాయ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి పి. శ్రీనివాసులు రెడ్డికి ఈ మేరకు చెక్ అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అధికారులు ప్రత్యేకంగా అమ్మవారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈవో రాంబాబు పాల్గొన్నారు.

నక్కవానిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కాటరాజు రెడ్డి


పోటీలో గెలుపొందిన అభ్యర్థులు

సీతమ్మధార, జూన్ 30: గ్రేటర్ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలో గ్రామ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా కాటరాజు రెడ్డి గెలుపొందారు. కార్యదర్శిగా శ్యామ్‌కుమార్, కోశాధికారిగా ధర్మల గురుమూర్తి రెడ్డిలను గ్రామస్తులు ఎన్నుకున్నారు. అధ్యక్ష పదవికి గ్రామానికి చెందిన గుడ్ల కాటరాజు రెడ్డి, దుంగి చంద్రగిరి రెడ్డిలు పోటీ చేయగా, కాటరాజు రెడ్డి పూర్తిమెజారిటీతో గెలుపొందారు. గ్రామ పెద్దలు, మాజీ కమిటీ అధ్యక్షుల పర్యవేక్షణలో ఈ ఎన్నిక ప్రక్రియ సజావుగా సాగింది.

'టీడీపీ వార్డు అధ్యక్షుడిని నియమించాలి'


వినతి పత్రం పరిశీలిస్తున్న గంటా శ్రీనివాసరావు

అక్కయ్యపాలెం, జూన్ 30: గ్రేటర్ 45వ వార్డు టీడీపీ అధ్యక్షునిగా వాసుపల్లి రాజును నియమించాలని కోరుతూ ఆ వార్డు బూత్ అధ్యక్షులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును, విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ, భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీననివాసరావులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. స్పందించిన వారు పరిశీలిస్తామని చెప్పారు. రానున్న మూడు నెలల్లో వార్డు కమిటీలు మారనున్నందున వాసుపల్లి రాజుకు మద్దతు పలుకుతున్నట్టు బూత్ కమిటీ అధ్యక్షులు చెప్పారు.



యాత కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న నూకరాజు

అక్కయ్యపాలెం, జూన్ 30: ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని యాత సామాజిక వర్గ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయనున్నట్టు ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు అన్నారు. నరసింహనగర్‌లోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లు గీత కార్మికులకు ఇన్సురెన్సూ, నష్టపరిహారం, పెన్షన్‌లు తదితర సమస్యలతో పాటు తమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు ఆయన వివరించారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల యాత, శెట్టిబలిజ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న పల్లా శ్రీనివాసరావు


శ్రీనివాసరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

విజయవాడ, జూన్ 30 : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుపల్లా శ్రీనివాసరావు ఆదివారం విజయవాడలోనికనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామారావు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మ వారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం, చిత్ర పటం అందజేశారు.

వాకర్స్ క్లబ్‌లో వైద్య శిబిరం


వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

మురళీనగర్, జూన్ 30 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు పల్లా.సత్యనారాయణ ఆధ్వర్యంలో అపోలో ఆసుపత్రి వైద్యులు రోగులకు ఈసీజీ, కంటి నేత్ర సంబంధిత వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య పరిరక్షణకు వైద్యురాలు ఎం.యామిని సూచలందించారు. క్లబ్ కార్యవర్గ సభ్యులు సహకరించారు.

4న రక్తదాన శిబిరం

జగదాంబ కూడలి, జూన్ 30: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని జూలై 4న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీకే కుమార్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్మికులు, దాతలు రక్తదానానికి ముందుకురావాలని ఆయన కోరారు.

ఏపీఎల్‌లో రాయలసీమ కింగ్స్ శుభారంభం

షేక్ రషీద్ అజేయ అర్ధ సెంచరీ వృథా

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూన్ 30: అట్టహాసంగా ప్రారంభమైన ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 టోర్నీలో రాయలసీమ కింగ్స్ జట్టు శుభారంభం చేసింది. ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో కోస్టల్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 149 పరుగులు చేసింది. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ షేక్ రషీద్ అజేయ అర్ధ సెంచరీతో (87 నాటౌట్) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. కేవలం 57 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో చెలరేగి బ్యాటింగ్ చేసిన షేక్ రషీద్‌కు మిగిలిన బ్యాటర్ల నుంచి తోడ్పాటందలేదు. మరో ఓపెనర్ ప్రణీత్ మన్యాల (14), వన్‌డౌన్ అభిషేక్ రెడ్డి (17) కొద్దిసేపు వికెట్ల ముందు నిలబడగా మిగిలినవారు పేలవమైన బ్యాటింగ్‌తో సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమై పెవిలియన్ దారి పట్టారు. రాయలసీమ కింగ్స్ బౌలర్లలో సత్యనారాయణరాజు, బి. వినయ్ చెరో రెండు వికెట్లు పడగొట్టగా...షేక్ మహ్మద్ రఫీ, ఆంజనేయులు, షేక్ కమరుద్దీన్ తలో వికెట్ తీశారు.

లక్ష్య ఛేదనలో రాయలసీమ కింగ్స్ బ్యాటర్లుతొలినుంచి ధాటిగా ఆడడంతో 15 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 153 పరుగులతో సునాయాస విజయం సాధించారు. ఓపెనర్లు కె. హనీష్‌రెడ్డి (23; 3 బౌండరీలు, 1 సిక్సర్), డీబీ ప్రశాంత్‌కుమార్ (38; 4 బౌండరీలు, 2 సిక్సర్లు) తొలి వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి శుభారంభాన్నిచ్చారు.హనీస్‌రెడ్డి స్థానంలో వన్‌డౌన్‌గా బ్యాటింగ్‌కు దిగిన పి. రోషన్‌కుమార్ పవన్ (47) బౌండరీలు, సిక్సర్లతో చెలరేగాడు. కేవలం 24 బంతుల్లో మూడు బౌండరీలు, నాలుగు సిక్సర్లతో 47 పరుగులు చేసి మూడో వికెట్‌గా అవుటయ్యాడు. తర్వాత వచ్చిన వంశీకృష్ణ (21; 3 బౌండరీలు), టి.శ్రావణ్ (16) రాణించి జట్టుకు సునాయాస విజయం అందించారు. కోస్టల్ రైడర్స్ బౌలర్లలో కార్తీక్ రామన్ రెండు, షేక్ అబ్దుల్లా ఒక వికెట్ తీశారు.

చంద్రబాబుకు చిత్రపటం బహూకరణ


చంద్రబాబుకు పెయింటింగ్‌ను బహూకరిస్తున్న విన్ని పాత్రో

ఎంవీపీ కాలనీ, జూన్ 30 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నగరానికి చెందిన యువకుడు, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ మాజీ సీఈఓ ఆర్.ఎస్. విన్ని పాత్రో ఆదివారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబుకు చిత్రపటాన్ని బహూకరించారు. విన్ని పాత్రోవిశాలాక్షినగర్‌లో ఉంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలోఐటీ రంగంలో పాత్రో ప్రతిభను గుర్తించిన అప్పటి ఐటీ మంత్రి లోకేష్ ఆంధ్రప్రదేశ్ ఇన్నవ్రేషన్ టెక్నాలజీ అడిషనల్ సీఈఓ.గా నియమించారు. కొద్ది నెలల్లోనే ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరపున వివిధ ప్రాంతాల్లో జాబ్ మేళాలు నిర్వహించి, యువతకు ఉపాధి కల్పించారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఆ పదవికి రాజీనామా చేసి, రికార్డెంట్ కంపెనీ కో ఫౌండర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా ఉన్నారు.

పెన్షన్ల సొమ్ము పెంపు ఘనత టీడీపీదే..

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్


చంద్రబాబుకు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్

మహారాణిపేట, జూన్ 30: సామాజిక పెన్షన్ల సొమ్ము పెంపు ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబుకే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. ఆదివారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛ మందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నజీర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసే మహత్తర ఘట్టానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల నుంచి రూ.4వేలు చొప్పున పెన్షన్ అందిస్తారన్నారు. ఏప్రిల్ నుంచి పెంచి మొత్తంతో కలిపి సోమవారం రూ. 7 వేలు అందజేసి, లబ్ధిదారుల్లో ఆనందం నిలుపుతారని తెలిపారు. అలాగే, మెగా డీఎస్సీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసి, హామీలు అమలు చేసిన ఏకైక నాయకుడిగా చంద్రబాబు నాయుడు నిలిచిపోతారని నజీర్ కొనియాడారు.

బంగ్లాదేశ్ చేరుకున్న ఐఎన్ఎస్ రణ్‌వీర్

విశాఖపట్నం, జూన్ 30: ఇండియన్ నేవల్ షిప్ ఐఎన్ఎస్ రణ్‌వీర్ శనివారం బంగ్లాదేశ్ చట్టోగ్రాం హార్బర్‌కు చేరుకుంది. నౌకకు సిబ్బందికి బంగ్లాదేశ్ నేవీ అధికారులు ఘనంగా స్వాగతించారు. బంగ్లాదేశ్ నేవీ నిర్వహించే మెరైన్ పార్టనర్ షిప్ ఎక్సర్‌సైజుల్లో పాల్గొనుంది. అనంతరం ఇరుదేశాల నేవీ అధికారులు సమావేశమై ఆధునిక సాంకేతిక వినియోగం,సాంకేతిక మార్పిడి అంశాలపై చర్చించనున్నారు. అనంతరం ఇరుదేశాల నేవీ సిబ్బంది స్నేహపూర్వక క్రీడల్లో పాల్గొననున్నారు.

సంక్షేమానికి పూర్వ వైభవం!

... 3వ పేజీ తరువాయి

సబ్సిడీతో కూడిన రుణాలు అందించారు. ఐదేళ్ల కాలం (2014-2019)లో జిల్లాలో సుమారు రూ.రెండు వేల కోట్ల విలువైన సబ్సిడీ రుణాలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలు అందించారు. మరో ఆరు వేల మందికి స్వయం ఉపాధి పరికరాలను ఇచ్చారు. ముఖ్యంగా రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఇతర కులవృత్తులు చేసుకునే వారికి అవసర మైన పరికరాలను అందించారు. వీటితో పాటు సబ్సిడీ రుణాలు తీసుకున్న ఎంతోమంది కోళ్ళు, పాడి పరిశ్రమ, చిరు వ్యాపారాలు, ఇతర వృత్తి సంబంధమైన దుకాణాలను ఏర్పాటుచేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

బటన్ నొక్కుడుకే పరిమితమైన జగన్

గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ బటన్ నొక్కుడు పథకాలకే ప్రాధాన్యం ఇచ్చారు. బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలను పూర్తిగా పక్కన పెట్టేశారు. ఆయా శాఖల అధికారులకు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేయడం, సెంట్రల్ ఆఫీస్‌కు పంపించడం మినహా మరో పనిలేకుండా పోయింది. కార్యాలయాల నిర్వహణకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యుత్ చార్జీలు చెల్లించలేని దుస్థితి వచ్చింది. చంద్రబాబు అధికారంలోకి రావడంతో మళ్లీ బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలు పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తాయని అంతా భావిస్తున్నారు.

ఇవీ హామీలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు అనేక సామాజిక వర్గాల వారికి ఆర్థికంగా సాయం అందిస్తామని ప్రకటించారు. గతంలో మాదిరిగా సబ్సిడీ రుణాలతో పాటు స్వయం ఉపాధికి వీలుగా వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు సహకరిస్తామన్నారు. సబ్సిడీపై కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు అందిస్తామన్నారు. చేతివృత్తులను ప్రోత్సహించేందుకు నాణ్యమైన పరికరాలను అందజేయడంతో పాటు కుల సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంఘాలకు కూడా సబ్సిడీ రుణాలిచ్చి ఉత్పాదక పరిశ్రమలు ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. వీటిపై ఆయా వర్గాలు ఆశలు పెంచుకుంటున్నాయి.

రెచ్చిపోతున్న బైక్ రేసర్లు

... 3వ పేజీ తరువాయి

సమాచారం చేరవేసుకోవడం ద్వారా భీమిలి, రుషికొండ, సింహాచలం బీఆర్‌టీఎస్‌రోడ్డు వంటి ప్రాంతాల్లో కలిసేవారు. అక్కడ గుట్టుగా రేసింగ్ పెట్టుకుని గంట వ్యవధిలో తిరిగి వేర్వేరుమార్గాల్లో వెళ్లిపోయేవారు. కానీ కొంతకాలంగా రేసింగ్‌లపై పోలీసుల నిఘా కొరవడడం, ఒకవేళ పట్టుబడినా తీవ్రమైన చర్యలు లేకపోవడంతో రేసర్లలో భయం పోయింది. ఏడాదిగా వారాంతాల్లో బీచ్‌రోడ్డులోకి వందల సంఖ్యలో యువత బైక్‌లతో చేరుతున్నారు. రాత్రి 12 గంటలు అయ్యేసరికి బైక్‌లపై మెరుపువేగంతో 'స్నేక్ రైడింగ్, స్పీడ్ రైడింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్, సింగిల్ హ్యాండ్ విత్ సింగిల్ లెగ్ డ్రైవింగ్' వంటి పేర్లతో పోటీలు పెట్టుకుంటున్నారు. ఆసమయంలో వారిని చూసేవారికి కళ్లుబైర్లు కమ్మడంతోపాటు కొందరికీ గుండె ఆగిపోయినంత పని అవుతుంది. బీచ్ రోడ్డు ప్రయాణించే వాహనాల పక్కనుంచే మెరుపువేగంతో బైక్ రేసర్లు దూసుకుపోవడం చూసి వాహనచోదకులు ఆందోళనతో ప్రమాదాలబారినపడుతున్నారు. రేసర్ల వాహనాల నుంచి వచ్చే శబ్దాలకు బీచ్‌లో గడిపేందుకు వచ్చే సందర్శకులు బీతిల్లిపోతుంటారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. శనివారం రాత్రి 12 గంటల సమయంలో వందకుపైగా రేసర్లు బైక్‌లపై ఆర్కేబీచ్ వద్ద గుమికూడారు. అక్కడి నుంచి ఒక్కసారిగా వాహనాలను స్టార్ట్‌చేసుకుని చీమలదండు మాదిరిగా బీచ్‌రోడ్డులో తమ వాహనాలతో ర్యాలీమాదిరిగా ఒకేసారి వెళుతూ విన్యాసాలు చేశారు. ఆ సమయంలో ఒక్క పోలీసు కూడా వారిని ఆపకపోవడం సందర్శకులను ఆశ్చర్యానికి గురిచేసింది. బీచ్‌రోడ్డులో భద్రత కోసం రాత్రిగస్తీ నిర్వహించే పెట్రోలింగ్ సిబ్బంది కూడా జాడలేకపోవడం పోలీసుల పనితీరుపై విమర్శలు గుప్పించారు. కొంతమంది సందర్శకులు రేసింగ్‌పై పోలీసులకు ఫోన్‌చేయడంతో పెట్రోలింగ్ సిబ్బంది చేరుకున్నప్పటికీ రేసర్లు అప్పటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో పోలీసులు వాహనాలతో సైరన్ మోగించుకుని బీచ్‌రోడ్డులో గస్తీ నిర్వహించారు.

ఏడాది కిందట స్వర్ణభారతి స్టేడియం వద్ద రేసర్లు వందల సంఖ్యలో చేరి బీఆర్‌టీఎస్‌రోడ్డుపై విన్యాసాలు చేశారు. ఆసమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మద్దిలపాలెం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సుని నిలిపేశారు. హారన్‌కొట్టారనే కారణంతో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేశారు. అనంతరం అక్కడి నుంచి సిరిపురం కూడలికి వెళ్లి విన్యాసాలు చేశారు. అయినప్పటికీ పోలీసులు వారిని కనీసం నిలువరించే ప్రయత్నం కూడా చేయకపోవడంతో ఆ ఘటన అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. తర్వాత పోలీసులు రేసింగ్‌ను నిలువరించే ప్రయత్నాలను కొనసాగించకపోవడంతో ఇప్పటికీ ఆర్కే బీచ్, సిరపురం కూడలి, సాగర్‌నగర్, తిమ్మాపురం, భీమిలి రోడ్డు, సింహాచలం బీఆర్‌టీఎస్‌రోడ్డులో బహిరంగంగా రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు.

అరకు కాఫీ అమోఘం

... 3వ పేజీ తరువాయి

అరకు కాఫీని ఆస్వాదించే అవకాశం లభించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. కాగా అరకు వ్యాలీలో కాఫీ సాగు, గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం, జీసీసీ అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించడం గర్వంగా ఉందని జీసీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి. సురేశ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.



స్వామివారి సన్నిధిలో ఎంపీ శ్రీభరత్

వైభవంగా గ్రీన్ సిటీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కూర్మన్నపాలెం, జూన్ 30: జీవీఎంసీ 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, తీర్థ గోష్ఠి, అగ్ని ప్రతిష్ఠ, కుంభవాహన, తదితర పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరుత్మంతుడు ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు గరుడ ముద్దలను ఎగురవేశారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సౌభాగ్యం, సంతాన ప్రాప్తి కలుగుతుందనే విశ్వాసంతో భక్తులు పోటీపడ్డారు. అమ్మవారికి కుంకుమపూజలు జరిపారు. భక్త బృందంవారి కోలాటం, నృత్యరూపకాలు, మహిళల అన్నమాచార్యుల భక్తిగీతాలు అలరించాయి. సాయంత్రం మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కోనేటిరాయుడిని శేషవాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వైజాగ్ ప్రొఫైల్స్ అధినేత బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు, పద్మజ, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, వెలగ వెంకటరావు, మల్లికార్జున్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ శ్రీభరత్

గ్రీన్‌సిటీలోని వేంకటేశ్వరస్వామిని రాత్రి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ దర్శించుకున్నారు. ఆయనకు వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీభరత్ స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక మెజారిటీతో తనను గెలిపించిన ప్రజల ఋణం తీర్చుకుంటానన్నారు. ప్రజల అభివృద్ధే టీడీపీ ధ్యేయమన్నారు. వైజాగ్ ప్రొఫైల్స్ ప్రతినిధులు శ్రీభరత్‌ను ఘనంగా సత్కరించారు.

పేదలకు నాణ్యమైన వైద్యసేవలందాలి

పెదగంట్యాడ, జూన్ 30: పేదలకు నాణ్యమైన వైద్యసేవలు ఉచితంగా అందించినప్పుడే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని సింహగిరి చారిటబుల్ ట్రస్టు మెడికల్ డైరెక్టర్ కేవీ కల్యాణ్ అన్నారు. ఆదివారం సాయిరాంనగర్‌లో సింహగిరి ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు కూడా నెలకు కానీ వారానికొక రోజు గానీ ఉచిత వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సంగీతలక్ష్మి, ట్రస్టు ప్రతినిధులు కె.జమునారాణి, మౌనిక, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

పెదగంట్యాడ, జూన్ 30: నూతన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి కోరారు. ఆదివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సామాజిక పింఛన్లను పెంచి సోమవారం నుంచి అమలు చేస్తున్నారని, దీనిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడు, నమ్మి అప్పారావు, పెరుమాళ్ల, శ్రీముసురు శ్రీనివాసరావు, ఎం.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 30: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించాలని కోరుతూ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. గడిచిన మూడేళ్ల కాలంలో ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో టీఎన్‌టీయూసీ పోరాటాలు సాగిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించి ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ టౌన్‌షిప్ ఇన్‌చార్జి అడుసుమల్లి దీప్తి, నాయకులు నమ్మి సింహాద్రి, నవీన్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, శారద, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **మహారాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 24, పచ్చిమిర్చి 88, కాకరకాయలు 48, బీరకాయలు 42, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 30, క్యారెట్ 38, దొండకాయలు 26, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 105, బరబాటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 126, పొటల్స్ 32, కీరదోస 32, క్యాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

రద్దు చేసిన బస్సులను నడపాలి

దశాబ్దంన్నర గడిచినా పునరుద్ధరణకు నోచుకోని 556, 6బీ, 8కే, 57బీ సర్వీసులు

నాడు రోడ్లు బాగోలేవని, రైల్వే గేట్ల కారణంగా ఆయా బస్సులను రద్దు చేసిన అధికారులు

నేడు ఎలాంటి అడ్డంకులు లేనందున మళ్లీ వాటిని నడపాలని కోరుతున్న ప్రజలు





ప్రస్తుతం బస్సుల రాకపోకలకు అనుకూలంగా ఉన్న నాయుడుతోట-మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు వెళ్లే రోడ్డు. (ఇన్‌సెట్లో) కొత్తవలస-నరవ గ్రామాల మధ్యనున్న రహదారి

గోపాలపట్నం, జూన్ 30: రహదారులు సక్రమంగా లేవని, రైల్వే గేట్ల కారణంగా రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయనే నెపంతో సుమారు దశాబ్దంన్నర క్రితం రద్దు చేసిన ఆర్టీసీ బస్ సర్వీసులను ఇప్పటికీ పునరుద్ధరించపోవడంతో వేలాది మంది ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గోపాలపట్నానికి సమీపంలోని మేహాద్రిగెడ్డ రిజర్వాయర్, నరవ గ్రామాలను నగరానికి కలుపుతూ దశాబ్దంన్నర క్రితం 556, 6బీ, 8కే, 57బీ నంబర్లతో ఆర్టీసీ బస్సులు నడిచేవి. 556, 6బీ బస్ సర్వీసుల వల్ల చింతగట్ల, నందవానిపాలెం, ఇప్పిలివానిపాలెం, జెర్రిపోతులపాలెం, నరవ, కోటనరవ, కొత్తపాలెం, చంద్రనగర్, పాత గోపాలపట్నం ప్రాంతాల ప్రజలు నగరానికి రాకపోకలు సాగించేందుకు సులభంగా ఉండేది. అదేవిధంగా 8కే, 57బీ బస్ సర్వీసుల వల్ల పద్మనాభనగర్, కంపరపాలెం, బంటా కాలనీ, మేహాద్రిగెడ్డ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు నగరానికి రాకపోకలు సాగించడానికి ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. అయితే ఆయా ప్రాంతాలకు బస్సులు నడిచే మార్గంలో రోడ్లు శిథిలావస్థకు చేరడంతో పాటు రైల్వే గేట్ల వద్ద గంటల తరబడి వేచివుండాల్సి వస్తుందన్న కారణంతో సుమారు దశాబ్దంన్నర క్రితం ఈ నాలుగు బస్ సర్వీసులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. కాగా అప్పట్లో పెద్దగా అభివృద్ధి చెందని ఈ ప్రాంతాలకు బస్ సర్వీసులను నిలిపివేసినా ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో లక్షలాది మంది జనాభా ప్రస్తుతం నివసిస్తున్నారు. వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం నగరానికి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పాటు వందల సంఖ్యలో టిడ్కో ఇళ్లు, పలు ఇంజనీరింగ్ కళాశాలలు కూడా ఈ ప్రాంతాల్లోనే ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలకు బస్సులు నడిపేందుకు దాదాపుగా అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. రోడ్లను బాగానే నిర్మించారు. దీంతో పాటు రైలు ట్రాక్‌ల ఇబ్బంది లేకుండా చంద్రనగర్, పాత గోపాలపట్నం ప్రాంతాల్లో అండర్‌పాస్‌వేలను నిర్మించారు. అందు వల్ల బస్ సర్వీసులు నిరాటంకంగా నడపేందుకు అవకాశం ఉన్నందున స్థానికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతంలో రద్దు చేసిన ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయవలసిందిగా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంటుకు పూర్వ వైభవమే ఇంటక్ లక్ష్యం

ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 30: స్టీల్‌ప్లాంటుకు పూర్వ వైభవమే లక్ష్యంగా ఇంటక్ ముందుకు సాగుతుందని, రాజకీయాలకు అతీతంగా ఉక్కు పరిరక్షణకు పోరాడతామని ఇంటక్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలు ముఖ్యం కాదని, ప్లాంట్ పరిరక్షణే ముఖ్యమని, ఇందుకోసం ఎంతటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. దేశంలోనే ఇంటక్ బలమైన కార్మిక శక్తిగా నిలిచి కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేస్తే మంచి ప్రయోజనాలు కలుగుతాయని, గతంలో ఇంటక్ హయాంలో ఉన్న కార్మిక ప్రయోజనాలకు కాలక్రమేణా ఉక్కు యాజమాన్యం మంగళం పాడేసిందని ఆరోపించారు. ప్రస్తుతం ఉద్యోగుల జీతాల కోసం పోరాడాల్సిన పరిస్థితి నెలకొందని, ఇలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు ఐక్యంగా ముందుకు సాగుతామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ 1,280 రోజులుగా ఆందోళనలు చేస్తున్నామని, త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర పెద్దలను కలిసి స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేయవద్దని, ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని కోరుతామన్నారు.

రాజకీయాలకు, ప్లాంట్ యూనియన్‌కు సంబంధం లేదని, కార్మికులు, సంస్థ కోసం ఎలాంటి త్యాగాలకైనా తాము సిద్ధమని మంత్రి రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కారు రమణ, బీఎన్ రాజు, కొవిరి అవతారం, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, డి.సాహూ, ఎస్‌పి నాయుడు, పీవీ రమణమూర్తి, రాథోడ్, పోతారెడ్డి, పీవీ.నగేశ్, బీటీ జగదీశ్, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బీఎంఎస్ నాయకుల దృష్టికి ఉక్కు సమస్యలు

స్టీల్‌ప్లాంటులో ప్రస్తుతం విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, వీటి నుంచి గట్టెక్కేందుకు కృషి చేయాలని కోరుతూ బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ ఇన్‌చార్జి డీకే పాండేకు స్టీల్ బీఎంఎస్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు బిలాయ్‌లో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ముడిసరకు, విద్యుత్ సరఫరా వంటి సమస్యలు ఉన్నాయని, ఈ ఇబ్బందులు లేకుండా చూడాలని, సెయిల్‌లో విలీనం చేసేందుకు కృషి చేయాలని, కార్మికులకు నూతన వేతన సవరణతో పాటు సకాలంలో జీతాలు ఇచ్చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

'పల్లా'కు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే

గాజువాక, జూన్ 30: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆదివారం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ పార్టీ కోసం కష్టించి పనిచేసే కార్యకర్తలకు మంచి గుర్తింపు ఇస్తామన్నారు. ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా టీడీపీ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లారు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు గాజువాకలో 32,179 మందికి పింఛన్లు

గాజువాక, జూన్ 30: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో 32,179 మందికి సోమవారం పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సచివాలయ సిబ్బంది, ఇతర శాఖలకు చెందిన ఉద్యోగులు లబ్ధిదారులకు పింఛన్లు అందజేయనున్నారు. ఒక్కో ఉద్యోగి సుమారు 50 మందికి పింఛన్లు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. సుమారు 917 మందికి రూ.22 కోట్ల తొమ్మిది లక్షలను పెన్షన్ల కింద అందజేయనున్నారు. కాగా 67వ వార్డులో సోమవారం ఉదయం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

జోన-8 పరిధిలో 16,700 మందికి..

వేపగుంట: గ్రేటర్ వేపగుంట జోన్-8 పరిధిలో 16,700 మందికి సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు ఏపీడీ శ్రీరామ్ పేర్కొన్నారు. ఇందుకోసం 600 సచివాలయాల సిబ్బందిని నియమించామన్నారు. కాగా 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో, పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని 93, 94, వార్డుల సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారు. ఏదిఏమైనా సాయంత్రం ఆరు గంటలకల్లా వంద శాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

పింఛన్ల పంపిణీలో కూటమి శ్రేణులు పాల్గొనాలి

కూర్మన్నపాలెం: లబ్ధిదారులకు సోమవారం చేపట్టనున్న సామాజిక పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పేర్కొన్నారు. వడ్లపూడిలోని పార్టీ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే సామాజిక పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టిన ఘనత దివంగత నందమూరి ఎన్టీ రామారావుకే దక్కుతుందన్నారు. సమావేశంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, డీవీ అప్పారావు, పెంటారావు, రాము, కృష్ణ, సత్తిబాబు, రాజన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి పార్కులో శ్రమదానం



పార్కును శుభ్రం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం, జూన్ 30: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లోని అమరావతి పార్కు అధ్వానంగా ఉండడంతో ఆదివారం కాలనీ వాసులు శుభ్రపరిచారు. కాలనీవాసులు సేదదీరేందుకు వీలుగా ఉండేందుకు గాను పార్కుల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం మాట్లాడుతూ పార్కుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సహకారంతో తొలగిస్తున్నామని, ఇందులో భాగంగా అమరావతి పార్కును శుభ్రపరిచామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, వసంతరెడ్డి, సన్యాసిరావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకవ్వడంతో అగ్ని ప్రమాదం



ప్రమాద స్థలంలో కార్పొరేటర్ బొండా జగన్, అగ్నిమాపక సిబ్బంది

రూ.నాలుగు లక్షల ఆస్తి నష్టం

కూర్మన్నపాలెం, జూన్ 30: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో నివసిస్తున్న కర్రి నూకరాజు భార్య ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకవ్వడంతో మంటలు ఇల్లంతా వ్యాపించాయి. దీంతో బయటకు వచ్చేందుకు అవకాశం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉండిపోయారు. వారు పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆ ఇంటి వెనక కిటికీని తొలగించడంతో కర్రి నూకరాజు కుటుంబ సభ్యులు క్షేమంగా బయటకు వచ్చారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదం మూలంగా ఇంట్లోని సామాన్లు, ఫ్యాన్లు, మైక్ సెట్లు, సౌండ్ బాక్సులు, తదితరమైనవి అగ్నికి ఆహుతైపోయాయి. సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్ బొండా జగన్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పెన్షనర్ల సమస్యలను ఎంపీలకు వివరిస్తాం

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (అప్పా) రాష్ట్ర కార్యదర్శి సుధాకర్



బాబాజీని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 30: పెన్షనర్ల సమస్యలను త్వరలో ఢిల్లీలో ఎంపీలను కలిసి వివరిస్తామని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (అప్పా) రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ పేర్కొన్నారు. 52వ వార్డు పరిధి ఎన్ఏడీలో ఉన్న హష్మి భవనంలో ఆదివారం జరిగిన అప్పా ప్రతినిధుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలపై ఆగస్టు 6,7,8 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరగనున్న ధర్నా కార్యక్రమాల్లో సభ్యులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా ఇటీవల మృతి చెందిన సంఘ రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణరాజుకు నివాళులర్పించారు. అనంతరం సంఘ సభ్యత్వ నమోదులో ప్రతిభ చూపిన బాబాజీని సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దీనబంధు, కార్యదర్శి ఎస్కే. హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మల్కాపురం, జూన్ 30: శ్రీహరిపురం మునిసిపల్ పాఠశాలలో 1986-1987లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో నాటి జ్ఞాపకాలను పంచుకుంటూ సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థి శరగడం పత్నీరావు అందరి సమాచారాన్ని సేకరించి ఈ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. తొలుత ఈ విద్యార్థులతా కేక్‌ను కట్ చేశారు. విద్యార్థి దశలో చోటుచేసుకున్న మధురానుభూతులను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇకపై ఏటా ఆత్మీయ సమావేశం నిర్వహించుకోవాలని నిర్ణయించారు.

ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

గాజువాక, జూన్ 30: స్టీల్ సిటీ ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్‌నకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 25న సర్టిఫికెట్ల పరిశీలన, 27, 28వ తేదీల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఐటిఐను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, జూన్ 30: పద్మనాభపురంలో కొత్త లైన్ల ఏర్పాటు, ఇతర నిర్వాహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండాని ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి తెలిపారు. ఈ కారణంగా బంటా కాలనీ, మేహాద్రిగెడ్డ కాలనీ, అప్పలనరసయ్యకాలనీ, వెంకటసాయినగర్, రవినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కూర్మన్నపాలెం, జూన్ 30: జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థనగర్‌లో వరసిద్ధి వినాయకుని 22వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశాక ప్రత్యేకంగా అలంకరించారు. కార్పొరేటర్ బొండా జగన్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

మాంసం దుకాణంలో మేకలు చోరీ

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

గోపాలపట్నం, జూన్ 30: మాంసం వ్యాపారికి చెందిన మేకలు చోరీకి గురైన సంఘటన కొత్తపాలెంలో చోటుచేసుకుంది. 89వ వార్డు కొత్తపాలెంలోని నాగేంద్ర కాలనీకి చెందిన షేక్ రెహమాన్ గ్రామంలోని అండర్‌పాస్‌వే కూడలిలో మాంసం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం దుకాణంలో మాంసం విక్రయించేందుకు గాను శనివారం రాత్రి మేకలను తీసుకువచ్చి షాపు వెనక భాగంలో ఉన్న షెడ్డులో పెట్టి ఇంటికి వెళ్లాడు. ఆదివారం వేకువజాము నాలుగు గంటలకు దుకాణానికి వచ్చి చూసేసరికి షాపు చుట్టూ ఉన్న ఇనుప కంచెను తొలగించి ఉండడాన్ని షేక్ రెహమాన్ గుర్తించాడు. లోపలకు వెళ్లి చూడగా సుమారు రూ.లక్ష విలువ చేసే ఆరు మేకలు కనిపించలేదు.

దీంతో మేకలను చోరులు ఎత్తుకుపోయారంటూ గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా కొత్తపాలెం అండర్‌పాస్‌వే కూడలిలో గత వారం రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ఈ ప్రాంతం చీకటిపడితే చాలు అంధకారంగా మారుతోంది. దీంతో చోరులు సులభంగా మేకల చోరీకి పాల్పడ్డారని షేక్ రెహమాన్ వాపోతున్నాడు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో 'రూట్స్' క్రీడాకారుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన చిన్నారులు

పెందుర్తి, జూన్ 30: షటిల్ బ్యాడ్మింటన్ విశాఖ ఆధ్వర్యంలో జిల్లా వార్షిక షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ, జిల్లా జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీల్లో పొర్లుపాలెంలోని రూట్స్ బాడ్మింటన్ అకాడమీ షటిల్ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్-13 బాలికల సింగిల్స్‌లో మోపాడ దర్శిని విజేతగా నిలవగా, బాలుర డబుల్స్‌లో తిరుమల అరుష్‌వర్మ, సాత్విన్ ఇషాన్ రన్నరప్‌గా నిలిచారు. ఈ పోటీల్లో తమ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికవ్వడం ఉంతో ఆనందం ఉందని రూట్స్ బ్యాడ్మింటన్ అకాడమీ కోచ్ రవిబాబు తెలిపారు. అలాగే ఇతర విభాగాల్లోనూ తమ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చూపారన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

కంచరపాలెం, జూన్ 30: జీవీఎంసీ పరిధి 47, 48, 54, 55, 56 వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఈ పింఛన్లను స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల సమక్షంలో సచివాలయాల సిబ్బంది అందజేయనున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, గీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి కొత్తగా పెంచిన పింఛన్లను అందజేయనున్నారు. ఈ పంపిణీలో ఆయా వార్డుల నాయకులు సహకారం అందించనున్నారు.

ఆస్పత్రికి మతిస్థిమితంలేని వ్యక్తి తరలింపు

డాబాగార్డెన్స్, జూన్ 30: మానసిక ఆరోగ్య స్థితి బాగోలేక రోడ్డుపై తిరుగుతున్న వ్యక్తిని గుర్తించి విశాఖ మానసిక వైద్యాలయంలో చికిత్స నిమిత్తం చేర్పించినట్టు ఏయూటీడీ సెక్రటరీ వాసు తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఇచ్చిన సమాచారం మేరకు రోడ్డుపై తిరుగుతున్న ఆ వ్యక్తిని పట్టుకుని ఏయూటీడీ భీమ్‌నగర్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించామన్నారు. అనంతరం ఆయన మానసిక పరిస్థితి బాగోలేదని గుర్తించిన మానసిక వైద్యాలయంలో చికిత్స నిమిత్తం చేర్పించినట్టు పేర్కొన్నారు.

'ఆప్సా' అధ్యక్షుడు సోమశేఖర్ సేవలు చిరస్మరణీయం



సోమశేఖర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మహారాణిపేట, జూన్ 30: విశాఖ జిల్లా ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ (అప్సా) అధ్యక్షుడిగా సోమశేఖర్ అందించిన సేవలు చిరస్మరణీయమని అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె. రామకృష్ణ కొనియాడారు. ఇటీవల సోమశేఖర్ ఆకస్మిక మృతి చెందటంతో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు సోమశేఖర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్, శ్రీనివాసరావు, అజయ్, గోవింద్ తదితరులతో పాటు, రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాలకు చెందిన ప్రతినిధులు, జిల్లాలోని పలు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా మారిన డెబ్రిస్ లిఫ్టింగ్ యంత్రం



ఆర్అండ్‌బీ యార్డు వద్ద నిలిచిన వ్యర్థాలు

మూన్నాళ్ల ముచ్చటేనా..?

» జ్ఞానాపురంలో పనిచేయని ఆటోమెటిక్ డెబ్రిస్ లిఫ్టింగ్ యంత్రం
» నాలుగు నెలల వ్యవధిలో మూలకు..
» రూ.1.89 కోట్లు బూడిదలో పోసిన పన్నీరైన వైనం
» యథావిధిగా లారీల్లో లోడింగ్.. జీవీఎంసీపై అదనపు భారం

జ్ఞానాపురం, జూన్ 30: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాలనీలు ముంపునకు లోనుకాకుండా ఎర్రిగెడ్డలో చెత్త తొలగించేందుకు ఆర్అండ్‌బీయార్డు వద్ద ఏర్పాటు చేసిన పవర్ అపరేటెడ్ మెకానికల్ ఎస్కలేటర్ యంత్రాలు (ఆటోమెటిక్ డెబ్రిస్ లిఫ్టింగ్ యంత్రం) మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు మార్చి 9వ తేదీన ఆర్అండ్‌బీ యార్డు వద్ద జీవీఎంసీ అధికారులు అప్పటి ఎమ్మెల్యే, వార్డు కార్పొరేటర్ ఒత్తిళ్లకు తలొగ్గి ఆదరాబాదరాగా రూ.1.89 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన ఈ యంత్రాలను ప్రారంభించారు. నాలుగునెలలు గడవకముందే ఈ యంత్రాలు పనిచేయడం మానేశాయి. ఎర్రిగెడ్డలో చెత్తా చెదారాలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు ట్రక్కుల్లో లోడు చేసేవిధంగా స్టెయిన్‌లెస్ స్టీల్ మెటీరియల్‌తో చేసిన ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేశారు. ఇది ప్రస్తుతం పనిచేయకపోవడంతో మళ్లీ అధిక వ్యయం వెచ్చించి జేసీబీల సాయంతో వ్యర్థాలను తొలగింపు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈ ప్రాంత వాసుల్లో పారిశుధ్యంపై ఆందోళన నెలకొంది. రూ. కోట్లు వెచ్చించిన యంత్రం ఎప్పటికప్పుడు చెత్త తొలగింపునకు ఉపయోగకరంగా ఉంటుందనుకుంటే ఏ మాత్రం ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. జీవీఎంసీ అధికారులకు ఏమాత్రం ముందు చూపు లేకపోవడంతో దాదాపు రూ. 2 కోట్ల ప్రజాధనంతో కొనుగోలుచేసిన ఈ యంత్రాల మూలకు చేరినట్టు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలు పనిచేయకపోవడంతో ఆర్అండ్‌బీ యార్డు వద్ద పెద్ద ఎత్తున వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. వాటిని జేసీపీ సాయంతో లారీల్లో లోడ్ చేయడానికి రూ. 1500 చొప్పున చెల్లించి తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజాధనం వృథా కాకుండా ఎస్కలేటర్ వినియోగంలోకి తేవాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.



చెత్త తొలగింపునకు పాతపద్ధతిలో జేసీబీ వినియోగం

కుసుమ హరనాథ నామ సంకీర్తనలు

డాబాగార్డెన్స్, జూన్ 30: డాబాగార్డెన్స్‌లోని శ్రీ కుసుమ హరనాథ మందిరం ప్రాంగణంలో నామ సంకీర్తనా కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు శ్రీ కుసుమహరనాథ సంకీర్తనలు గానం చేశారు. అనంతరం ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ మాట్లాడుతూ, భగవన్నామ సంకీర్తన చేసిన వారికి మానసిక ప్రశాంతతతోపాటు ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బి. శివసీతారాం, సాయిరాం, హరి, హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు సన్మానం



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుని సన్మానిస్తున్న ఔం శ్రీయుగ సెంటర్ ప్రతినిధులు

సీతమ్మధార, జూన్ 30: సీతమ్మధారలోని ఔం శ్రీ యుగ సెంటర్ ప్రతినిధులు ఉత్తర నియోజకవర్గ శాసన సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పి. విష్ణుకుమార్‌రాజును సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఔం యుగ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయం అభివృద్ధికి విరాళం



ఆలయ ఈవోకు చెక్ అందజేస్తున్న కిశోర్

జగదాంబ కూడలి, జూన్ 30: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం అభివృద్ధికి నగరానికి చెందిన కేదార్ శెట్టి కిశోర్ రూ. 1,11,116లను విరాళంగా అందించారు. ఆదివారం దేవదాయ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి పి. శ్రీనివాసులు రెడ్డికి ఈ మేరకు చెక్ అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అధికారులు ప్రత్యేకంగా అమ్మవారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈవో రాంబాబు పాల్గొన్నారు.

'టీడీపీ వార్డు అధ్యక్షుడిని నియమించాలి'



వినతి పత్రం పరిశీలిస్తున్న గంటా శ్రీనివాసరావు

అక్కయ్యపాలెం, జూన్ 30: గ్రేటర్ 45వ వార్డు టీడీపీ అధ్యక్షునిగా వాసుపల్లి రాజును నియమించాలని కోరుతూ ఆ వార్డు బూత్ అధ్యక్షులు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును, విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ, భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీననివాసరావులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. స్పందించిన వారు పరిశీలిస్తామని చెప్పారు. రానున్న మూడు నెలల్లో వార్డు కమిటీలు మారనున్నందున వాసుపల్లి రాజుకు మద్దతు పలుకుతున్నట్టు బూత్ కమిటీ అధ్యక్షులు చెప్పారు.

నక్కవానిపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కాటరాజు రెడ్డి



పోటీలో గెలుపొందిన అభ్యర్థులు

సీతమ్మధార, జూన్ 30: గ్రేటర్ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలో గ్రామ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా కాటరాజు రెడ్డి గెలుపొందారు. కార్యదర్శిగా శ్యామ్‌కుమార్, కోశాధికారిగా ధర్మల గురుమూర్తి రెడ్డిలను గ్రామస్తులు ఎన్నుకున్నారు. అధ్యక్ష పదవికి గ్రామానికి చెందిన గుడ్ల కాటరాజు రెడ్డి, దుంగి చంద్రగిరి రెడ్డిలు పోటీ చేయగా, కాటరాజు రెడ్డి పూర్తిమెజారిటీతో గెలుపొందారు. గ్రామ పెద్దలు, మాజీ కమిటీ అధ్యక్షుల పర్యవేక్షణలో ఈ ఎన్నిక ప్రక్రియ సజావుగా సాగింది.

యాత కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నూకరాజు

అక్కయ్యపాలెం, జూన్ 30: ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని యాత సామాజిక వర్గ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయనున్నట్టు ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు అన్నారు. నరసింహనగర్‌లోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లు గీత కార్మికులకు ఇన్సూరెన్సు, నష్టపరిహారం, పెన్షన్‌లు తదితర సమస్యలతో పాటు తమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు ఆయన వివరించారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల యాత, శెట్టిబలిజ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న పల్లా శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

విజయవాడ, జూన్ 30 : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామారావు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మ వారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం, చిత్ర పటం అందజేశారు.

వాకర్స్ క్లబ్‌లో వైద్య శిబిరం



వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

మురళీనగర్, జూన్ 30 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు పల్లా.సత్యనారాయణ ఆధ్వర్యంలో అపోలో ఆసుపత్రి వైద్యులు రోగులకు ఈసీజీ, కంటి నేత్ర సంబంధిత వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య పరిరక్షణకు వైద్యురాలు ఎం.యామిని సూచలందించారు. క్లబ్ కార్యవర్గ సభ్యులు సహకరించారు.

4న రక్తదాన శిబిరం

జగదాంబ కూడలి, జూన్ 30: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని జూలై 4న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు సీటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీకే కుమార్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్మికులు, దాతలు రక్తదానానికి ముందుకురావాలని ఆయన కోరారు.

ఏపీఎల్‌లో రాయలసీమ కింగ్స్ శుభారంభం

షేక్ రషీద్ అజేయ అర్ధ సెంచరీ వృథా

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 30: అట్టహాసంగా ప్రారంభమైన ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 టోర్నీలో రాయలసీమ కింగ్స్ జట్టు శుభారంభం చేసింది. ఆదివారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో కోస్టల్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓ వర్లలో ఏడు వికెట్లకు 149 పరుగులు చేసింది. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ షేక్ రషీద్ అజేయ అర్ధ సెంచరీతో (87 నాటౌట్) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. కేవలం 57 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో చెలరేగి బ్యాటింగ్ చేసిన షేక్ రషీద్‌కు మిగిలిన బ్యాటర్ల నుంచి తోడ్పాటందలేదు. మరో ఓపెనర్ ప్రణీత్ మన్యాల (14), వన్‌డౌన్ అభిషేక్ రెడ్డి (17) కొద్దిసేపు వికెట్ల ముందు నిలబడగా మిగిలినవారు పేలవమైన బ్యాటింగ్‌తో సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమై పెవిలియన్ దారి పట్టారు. రాయలసీమ కింగ్స్ బౌలర్లలో సత్యనారాయణరాజు, బి. వినయ్ చెరో రెండు వికెట్లు పడగొట్టగా...షేక్ మహ్మద్ రఫీ, ఆంజనేయులు, షేక్ కమరుద్దీన్ తలో వికెట్ తీశారు.

లక్ష్య ఛేదనలో రాయలసీమ కింగ్స్ బ్యాటర్లుతొలినుంచి ధాటిగా ఆడడంతో 15 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 153 పరుగులతో సునాయాస విజయం సాధించారు. ఓపెనర్లు కె. హనీష్‌రెడ్డి (23; 3 బౌండరీలు, 1 సిక్సర్), డీబీ ప్రశాంత్‌కుమార్ (38; 4 బౌండరీలు, 2 సిక్సర్లు) తొలి వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి శుభారంభాన్నిచ్చారు.హనీస్‌రెడ్డి స్థానంలో వన్‌డౌన్‌గా బ్యాటింగ్‌కు దిగిన పి. రోషన్‌కుమార్ పవన్ (47) బౌండరీలు, సిక్సర్లతో చెలరేగాడు. కేవలం 24 బంతుల్లో మూడు బౌండరీలు, నాలుగు సిక్సర్లతో 47 పరుగులు చేసి మూడో వికెట్‌గా అవుటయ్యాడు. తర్వాత వచ్చిన వంశీకృష్ణ (21; 3 బౌండరీలు), టి.శ్రావణ్ (16) రాణించి జట్టుకు సునాయాస విజయం అందించారు. కోస్టల్ రైడర్స్ బౌలర్లలో కార్తీక్ రామన్ రెండు, షేక్ అబ్దుల్లా ఒక వికెట్ తీశారు.

చంద్రబాబుకు చిత్రపటం బహూకరణ



చంద్రబాబుకు పెయింటింగ్‌ను బహూకరిస్తున్న విన్ని పాత్రో

ఎంవీపీ కాలనీ, జూన్ 30 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నగరానికి చెందిన యువకుడు, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ మాజీ సీఈఓ ఆర్.ఎస్. విన్ని పాత్రో ఆదివారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబుకు చిత్రపటాన్ని బహూకరించారు. విన్ని పాత్రోవిశాలాక్షినగర్‌లో ఉంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలోఐటీ రంగంలో పాత్రో ప్రతిభను గుర్తించిన అప్పటి ఐటీ మంత్రి లోకేష్ ఆంధ్రప్రదేశ్ ఇన్నర్వేషన్ టెక్నాలజీ అడిషనల్ సీఈఓ.గా నియమించారు. కొద్ది నెలల్లోనే ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరపున వివిధ ప్రాంతాల్లో జాబ్ మేళాలు నిర్వహించి, యువతకు ఉపాధి కల్పించారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఆ పదవికి రాజీనామా చేసి, రికార్డెంట్ కంపెనీ కో ఫౌండర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా ఉన్నారు.

పెన్షన్ల సొమ్ము పెంపు ఘనత టీడీపీదే..

» రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్



చంద్రబాబుకు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్

మహారాణిపేట, జూన్ 30: సామాజిక పెన్షన్ల సొమ్ము పెంపు ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబుకే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. ఆదివారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛ మందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నజీర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 65 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు అంద జేసే మహత్తర ఘట్టానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా సోమవారం శ్రీకారం చుట్టనున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల నుంచి రూ.4వేలు చొప్పున పెన్షన్ అందిస్తారన్నారు. ఏప్రిల్ నుంచి పెంచి మొత్తంతో కలిపి సోమవారం రూ. 7 వేలు అందజేసి, లబ్ధిదారుల్లో ఆనందం నిలుపుతారని తెలిపారు. అలాగే, మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసి, హామీలు అమలు చేసిన ఏకైక నాయకుడిగా చంద్రబాబు నాయుడు నిలిచిపోతారని నజీర్ కొనియాడారు.

బంగ్లాదేశ్ చేరుకున్న ఐఎన్ఎస్ రణ్‌వీర్

విశాఖపట్నం, జూన్ 30: ఇండియన్ నేవల్ షిప్ ఐఎన్ఎస్ రణ్‌వీర్ శనివారం బంగ్లాదేశ్ చట్టోగ్రాం హార్బర్‌కు చేరుకుంది. నౌకకు సిబ్బందికి బంగ్లాదేశ్ నేవీ అధికారులు ఘనంగా స్వాగతించారు. బంగ్లాదేశ్ నేవీ నిర్వహించే మెరైన్ పార్టనర్ షిప్ ఎక్సర్‌సైజుల్లో పాల్గొనుంది. అనంతరం ఇరుదేశాల నేవీ అధికారులు సమావేశమై ఆధునిక సాంకేతిక వినియోగం,సాంకేతిక మార్పిడి అంశాలపై చర్చించనున్నారు. అనంతరం ఇరుదేశాల నేవీ సిబ్బంది స్నేహపూర్వక క్రీడల్లో పాల్గొననున్నారు.

సంక్షేమానికి పూర్వ వైభవం!

... 3వ పేజీ తరువాయి

సబ్సిడీతో కూడిన రుణాలు అందించారు. ఐదేళ్ల కాలం (2014-2019)లో జిల్లాలో సుమారు రూ.రెండు వేల కోట్ల విలువైన సబ్సిడీ రుణాలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలు అందించారు. మరో ఆరు వేల మందికి స్వయం ఉపాధి పరికరాలను ఇచ్చారు. ముఖ్యంగా రజకులు, నాయీ బ్రాహ్మణులు, ఇతర కులవృత్తులు చేసుకునే వారికి అవసర మైన పరికరాలను అందించారు. వీటితో పాటు సబ్సిడీ రుణాలు తీసుకున్న ఎంతోమంది కోళ్లు, పాడి పరిశ్రమ, చిరు వ్యాపారాలు, ఇతర వృత్తి సంబంధమైన దుకాణాలను ఏర్పాటుచేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

బటన్ నొక్కుడుకే పరిమితమైన జగన్

గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ బటన్ నొక్కుడు పథకాలకే ప్రాధాన్యం ఇచ్చారు. బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలను పూర్తిగా పక్కన పెట్టేశారు. ఆయా శాఖల అధికారులకు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేయడం, సెంట్రల్ ఆఫీస్‌కు పంపించడం మినహా మరో పనిలేకుండా పోయింది. కార్యాలయాల నిర్వహణకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యుత్ చార్జీలు చెల్లించలేని దుస్థితి వచ్చింది. చంద్రబాబు అధికారంలోకి రావడంతో మళ్లీ బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలు పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తాయని అంతా భావిస్తున్నారు.

ఇవీ హామీలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు అనేక సామాజిక వర్గాల వారికి ఆర్థికంగా సాయం అందిస్తామని ప్రకటించారు. గతంలో మాదిరిగా సబ్సిడీ రుణాలతో పాటు స్వయం ఉపాధికి వీలుగా వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు సహకరిస్తామన్నారు. సబ్సిడీపై కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు అందిస్తామన్నారు. చేతివృత్తులను ప్రోత్సహించేందుకు నాణ్యమైన పరికరాలను అందజేయడంతో పాటు కుల సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంఘాలకు కూడా సబ్సిడీ రుణాలిచ్చి ఉత్పాదక పరిశ్రమలు ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. వీటిపై ఆయా వర్గాలు ఆశలు పెంచుకుంటున్నాయి.

రెచ్చిపోతున్న బైక్ రేసర్లు

... 3వ పేజీ తరువాయి

సమాచారం చేరవేసుకోవడం ద్వారా భీమిలి, రుషికొండ, సింహాచలం బీఆర్‌టీఎస్‌రోడ్డు వంటి ప్రాంతాల్లో కలిసేవారు. అక్కడ గుట్టుగా రేసింగ్ పెట్టుకుని గంట వ్యవధిలో తిరిగి వేర్వేరుమార్గాల్లో వెళ్లిపోయేవారు. కానీ కొంతకాలంగా రేసింగ్‌లపై పోలీసుల నిఘా కొరవడడం, ఒకవేళ పట్టుబడినా తీవ్రమైన చర్యలు లేకపోవడంతో రేసర్లలో భయం పోయింది. ఏడాదిగా వారాంతాల్లో బీచ్‌రోడ్డులోకి వందల సంఖ్యలో యువత బైక్‌లతో చేరుతున్నారు. రాత్రి 12 గంటలు అయ్యేసరికి బైక్‌లపై మెరుపువేగంతో 'స్నేక్ రైడింగ్, స్పీడ్ రైడింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్, సింగిల్ హ్యాండ్ విత్ సింగిల్ లెగ్ డ్రైవింగ్' వంటి పేర్లతో పోటీలు పెట్టుకుంటున్నారు. ఆసమయంలో వారిని చూసేవారికి కళ్లుబైర్లు కమ్మడంతోపాటు కొందరికీ గుండె ఆగిపోయినంత పని అవుతుంది. బీచ్ రోడ్డు ప్రయాణించే వాహనాల పక్కనుంచే మెరుపువేగంతో బైక్ రేసర్లు దూసుకుపోవడం చూసి వాహనచోదకులు ఆందోళనతో ప్రమాదాలబారినపడుతున్నారు. రేసర్ల వాహనాల నుంచి వచ్చే శబ్దాలకు బీచ్‌లో గడిపేందుకు వచ్చే సందర్శకులు బిత్తిల్లిపోతుంటారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. శనివారం రాత్రి 12 గంటల సమయంలో వందకుపైగా రేసర్లు బైక్‌లపై ఆర్కేబీచ్ వద్ద గుమికూడారు. అక్కడి నుంచి ఒక్కసారిగా వాహనాలను స్టార్ట్‌చేసుకుని చీమలదండు మాదిరిగా బీచ్‌రోడ్డులో తమ వాహనాలతో ర్యాలీమాదిరిగా ఒకేసారి వెళుతూ విన్యాసాలు చేశారు. ఆ సమయంలో ఒక్క పోలీసు కూడా వారిని ఆపకపోవడం సందర్శకులను ఆశ్చర్యానికి గురిచేసింది. బీచ్‌రోడ్డులో భద్రత కోసం రాత్రిగస్తీ నిర్వహించే పెట్రోలింగ్ సిబ్బంది కూడా జాడలేకపోవడం పోలీసుల పనితీరుపై విమర్శలు గుప్పించారు. కొంతమంది సందర్శకులు రేసింగ్‌పై పోలీసులకు ఫోన్‌చేయడంతో పెట్రోలింగ్ సిబ్బంది చేరుకున్నప్పటికీ రేసర్లు అప్పటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో పోలీసులు వాహనాలతో సైరన్ మోగించుకుని బీచ్‌రోడ్డులో గస్తీ నిర్వహించారు.

ఏడాది కిందట స్వర్ణభారతి స్టేడియం వద్ద రేసర్లు వందల సంఖ్యలో చేరి బీఆర్‌టీఎస్‌రోడ్డుపై విన్యాసాలు చేశారు. ఆసమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మద్దిలపాలెం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సుని నిలిపేశారు. హారన్‌కొట్టారనే కారణంతో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేశారు. అనంతరం అక్కడి నుంచి సిరిపురం కూడలికి వెళ్లి విన్యాసాలు చేశారు. అయినప్పటికీ పోలీసులు వారిని కనీసం నిలువరించే ప్రయత్నం కూడా చేయకపోవడంతో ఆ ఘటన అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. తర్వాత పోలీసులు రేసింగ్‌ను నిలువరించే ప్రయత్నాలను కొనసాగించకపోవడంతో ఇప్పటికీ ఆర్కే. బీచ్, సిరిపురం కూడలి, సాగర్‌నగర్, తిమ్మాపురం, భీమిలి రోడ్డు, సింహాచలం బీఆర్‌టీఎస్‌రోడ్డులో బహిరంగంగా రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు.

అరకు కాఫీ అమోఘం

... 3వ పేజీ తరువాయి

అరకు కాఫీని ఆస్వాదించే అవకాశం లభించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. కాగా అరకు వ్యాలీలో కాఫీ సాగు, గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం, జీసీసీ అందిస్తున్న ప్రోత్సాహాన్ని ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించడం గర్వంగా ఉందని జీసీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి. సురేశ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యకర్తల సమావేశం

తగరపువలస, జూన్ 30 : గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం నుంచి జరిగే పింఛన్ల పంపిణీని పర్యవేక్షించాలని 1వ వార్డు టీడీపీ నాయకులు నిర్ణయించారు. ఆదివారం తగరపువలసలో కార్పొరేటర్ ప్రభావతి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. పింఛన్ల పంపిణీకి కార్యకర్తలు గ్రామ సచివాలయ సిబ్బందికి సహకరించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నరసింగరావు, ఎస్సీ సెల్ నాయకుడు రామారావు, టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ఆనందపురం, జూన్ 30 : మండలంలోని వెల్లంకి పంచాయతీ పరిధి బొడ్డపాలెంనకు చెందిన జనసేన పార్టీ కార్యకర్త తోనంగా నరసిహారెడ్డి (జాని) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతని కుటుంబానికి ఆ గ్రామ జనసేన పార్టీ నాయకులు ఆదివారం రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గొలగాని గోవింద్ బాలు, మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి మూర్తి, కార్యదర్శి నాని, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

ఆనందపురం, జూన్ 30 : మండలంలో ఉన్న 8821 మంది పింఛన్‌దారులకు సోమవారం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలిరోజే 90 శాతం మేర పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని పంచాయతీల కార్యదర్శులను ఆదేశించారు. సచివాలయం ఉద్యోగికి 50 ఇళ్లు కంటే ఎక్కువగా ఉండకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మండలంలోని 18 సచివాలయాల పరిధిలో 164 మంది ఉద్యోగులు ఉండగా,మరో 185 మందిని ఇతర శాఖల నుంచి తీసుకున్నామన్నారు. మొత్తం రూ. 5.79 కోట్లను లబ్ధిదారులకు అందించనున్నట్టు వివరించారు.

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ, స్వతంత్రనగర్ కాలనీల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా సోమవారం పింఛన్ల పంపిణీ ప్రారంభించనున్నారు. ఉదయం 7 గంటలకు 5, 6, 7 వార్డుల లబ్ధిదారులకు, 7.30 నిమిషాలకు భీమిలి ఎగువపేట,8 గంటలకు బ్యాంకు కాలనీ, 8.30 గంటలకు తగరపువలస శారదా స్కూల్ సమీపంలో, 9.30 గంటలకు మజ్జివలస, 10.30 గంటలకు పద్మనాభం, 11 గంటలకు ఆనందపురం మండలం శిర్లపాలెం, 11.30 గంటలకు అడవివరంలో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు.

పద్మనాభం : మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఉన్న 8013 మంది లబ్ధిదారులకు సోమవారం పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలకు కేటాయించిన 125 మంది సచివాలయ ఉద్యోగులకు మూడు నెలల ఎరియర్స్‌తో కలిపి పింఛను నగదు రూ.5,24,79,500 లను విడుదల చేశారు.

గ్యాస్ లీకవ్వడంతో అగ్ని ప్రమాదం

కూర్మన్నపాలెం, జూన్ 30: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో నివసిస్తున్న కర్రి నూకరాజు భార్య ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకవ్వడంతో మంటలు ఇల్లంతా వ్యాపించాయి. దీంతో బయటకు వచ్చేందుకు అవకాశం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉండిపోయారు. వారు పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఇంటి వెనక కిటికీని తొలగించడంతో కర్రి నూకరాజు కుటుంబ సభ్యులు క్షేమంగా బయటకు వచ్చారు. స్థానికుల సమాచారం మేరకు అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.అగ్ని ప్రమాదం మూలంగా ఇంట్లోని సామాన్లు, ఫ్యాన్లు, మైక్ సెట్లు, సౌండ్ బాక్సులు, తదితరమైనవి అగ్నికి ఆహుతైపోయాయి. సుమారు రూ. 4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కార్పొరేటర్ బొండా జగన్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


ప్రమాద స్థలంలో కార్పొరేటర్ బొండా జగన్, అగ్నిమాపక సిబ్బంది

సినిమా గైడ్

- **కల్కి :** మెలోడి, జగదాంబ, రమాదేవి, శారద, సంగం, శరత్, శ్రీరామ, శ్రీకన్య, గోకుల్, కిన్నెర, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని, శ్రీకన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **మహరాజ :** రమాదేవి, తాతా (తగరపువలస), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **హరోం హర :** రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35,టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 24, పచ్చిమిర్చి 88, కాకరకాయలు 48, బీరకాయలు 42, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారేట్ 38, దొండకాయలు 26, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 105, అల్లం (పాతది) 150, బరబటి 60, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోస కాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 126, పొటల్స్ 32, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	120
ఫారం ధర	--	140
విత్ స్కిన్	--	250
స్కిన్‌లెస్	--	260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..


ఇంటర్‌కు హైస్కూల్ భవనంలో కేటాయించిన గదులు


జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం

స్థలమిచ్చారు.. వసతి మరిచారు

- ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కలగానే భవన నిర్మాణం
- ప్రస్తుతం పరాయి పంచన బోధన
- ఇరుకు గదులతో విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ఆనందపురం, జూన్ 30 : ఆనందపురం జట్టమ్మ కొండపై జూనియర్ కళాశాల నిర్మాణానికి కేటాయించిన స్థలంలో ఈ విద్యా సంవత్సరంలోనైనా భవన నిర్మాణాలకు మోక్షం కలుగుతుందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా ఏటా సుమారు వెయ్యి మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులవుతున్నారు. వారు ఉన్నత చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. మరికొంత మంది ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని 2019లో వైసీపీ ప్రభుత్వం మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేసింది. కళాశాల భవనాల నిర్మాణానికి ఆనందపురం రెవెన్యూ సర్వే నెంబరు 276 పార్టులో 2 ఎకరాల 50 సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించారు. తాత్కాలికంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఒక భవనాన్ని కేటాయించి జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కళాశాలకు కేటాయించిన స్థలంలో భవనాలు నిర్మించకపోవడంతో అరకొర వసతులతో చిన్న భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు.ప్రస్తుతం రెండు గదుల్లో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం బోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులు, ఎంఎల్‌టీ, ఏఈటీ కోర్సులు ఉన్నాయి. ఇక్కడ ఒక టైపిస్టుతో పాటు ఎనిమిది మంది గెస్ట్ అధ్యాపకులు ఉండగా మధురవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇక్కడ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రారంభించిన మొదట్లో అధిక సంఖ్యలో ప్రవేశాలు పొందినప్పటికీ వసతి కొరత వల్ల కళాశాలలో చేరేందుకు విద్యార్థులు అనాసక్తి చూపుతున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. కేటాయించిన స్థలంలో భవనాలు నిర్మించి వసతులు పెంచినట్లయితే ఇంటర్‌లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండి కూడా చాలామంది ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జూనియర్ కళాశాలకు భవనాలు నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మధురవాడ, జూన్ 30 : జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వరస్వామి ఆలయ ఐదవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, రుత్వికవరుణం, అఖండ దీపారాధన, మండపారాధన జరిపారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్, శిమ్మ పాపారావు, నిర్మల, తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

అప్పన్న సేవా భాగ్యం పూర్వజన్మ సుకృతం : ఈఓ


రామానుజంను సన్మానిస్తున్న ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, జూన్ 30 : వరాహలక్ష్మీనృసింహస్వామి సేవా భాగ్యం కలగడం పూర్వ జన్మ సుకృతమని ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి అన్నారు. స్వామివారి నాలాయిర అధ్యాపకుడిగా విధులు నిర్వహించిన నిడమర్తి కందాడై వరాహ కృష్ణ రామానుజం పదవీ విరమణ సందర్భంగా ఆదివారం ఆలయ కల్యాణ మండపంలో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. 1987లో సింహాచలం దేవస్థానం అనుబంధ ఆలయం పద్మనాభస్వామి ఆలయంలో రూ. 300 నెల వేతనానికి నిత్య అధ్యాపక, రామాయణ పారాయణదారుడిగా హాజరైన రామానుజ రెండుసార్లు ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసలు పొందారని చెప్పారు. అప్పన్న ఆలయంలో 38 ఏళ్ల పాటు నాలాయిర అధ్యాపకుడిగా విధులు నిర్వహించారని చెప్పారు. అనంతరం ఈఓ దేవస్థానం తరఫున శాలువతో సత్కరించి, స్వామివారి చిత్తరువును జ్ఞాపికగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, వెంకటరమణాచార్యులు, ఈఈ డిజి శ్రీనివాసాచార్యులు, ఏఈఓలు రమణమూర్తి, రాజేంద్రకుమార్, ఆనందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ పండగకు ఏర్పాట్లు

ఎండాడ/సాగర్‌నగర్, జూన్ 30 : ఎండాడ ప్రజల ఆరాధ్య దైవం దుర్గాలమ్మ అమ్మవారి పండగకు ఏర్పాట్లు చేస్తు న్నట్టు ఎండాడ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాదు రాజు తెలిపారు. ఆదివారం ఆయన ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 7న పండగ చాటింపు, 16న పండగ ఉంటుందన్నారు. పది రోజుల పాటు ఆలయంలో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు. పండగ రోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, చిన్న గోపి, మెంబర్ గోపి, జనసేన నాయకుడు శ్రీనుబాబు, చెట్టుపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

సింహగిరిపై విద్యార్థుల ట్రెక్కింగ్

సింహాచలం, జూన్ 30 : నగరానికి చెందిన డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఆదివారం సింహగిరిపై ట్రెక్కింగ్ చేశారు. ఉదయం మాధవధారలోని మాధవస్వామి ఆలయానికి చేరువలోని మెట్ల మార్గంలో కాలినడకన సుమారు గంటన్నరపాటు శ్రమించి సింహగిరికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న తరువాత తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవీంద్ర

పెదవాల్తేరు, జూన్ 30 : నగరంలోని నిరుద్యోగ యువతకు నాలుగు నెలలు పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వను న్నట్టు బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం అధ్యక్షుడు ఎంఎం మహేష్, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, బీజేపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ అనంతరం యువతకు స్వయం ఉపాధి ఏర్పాటుకు అవ కాశం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నగరంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి విజయానందరెడ్డి, సీనియర్ నాయకులు ప్రకాశ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ రంగం ధనేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత రాజ్, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, తదితరులు

రాష్ట్ర క్రీడా శాఖా మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

సాగర్‌నగర్, జూన్ 30 : సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో బస చేసిన రాష్ట్ర క్రీడా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో సీఏల 2కే రన్



2కే రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న సీఏలు

మహారాణిపేట, జూన్ 30 : ఇండియన్ చార్టర్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా 76వ వార్షికోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డులో ఆదివారం 2కే రన్ నిర్వహించారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అనిర్బన్పాల్ మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, రక్తదాన శిబిరం, మొక్కలు నాటడం, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి కార్యక్ర మాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్టర్ అకౌంటెంట్స్, సీనియర్ చార్టర్ అకౌంటెంట్స్, సీఏ విద్యా ర్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సహకరించండి

భీమునిపట్నం, జూన్ 30 : పింఛన్ల పంపిణీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని 4వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు కోరారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం ఆయన సోమన్నపాలెంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెల్లవారుజామున 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని, ఆ సమయానికి కార్యకర్తలు కూడా సిద్ధంగా వుండాలని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు వాసుపల్లి నూకరాజు, పోతిన సాంబ, బోర బంగారురెడ్డి, పోతిన అప్పలరాజు, శీరపు రమణ, వాపుపల్లి ఎల్లయ్య, కారి అప్పారావు, మరుపిళ్ళ రాజేంద్రప్రసాద్, కోడిబోయిన రాంబాబు, నారు ఎల్లాజి, పాసి త్రినాథ్‌కుమార్ పాల్గొన్నారు.

అలరించిన భక్తప్రహ్లాద నాటిక


నాటికలో చివరి ఘట్టం ప్రదర్శనలో కళాకారులు

మద్దిలపాలెం, జూన్ 30 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సురభి నాటకోత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటిక అలరించింది. హిరణ్యకశ్యపుడు, అతని పుత్రుడు ప్రహ్లాదుడు మధ్య భక్తిపై సాగిన సన్నివేశాలు రక్తి కట్టించాయి. నారాయణుడ్ని ద్వేషించే హిరణ్యకశ్యపుడుకి అతని కుమారుడు విష్ణు భక్తుడు కావడం, తట్టుకోలేని ఆయన పుత్ర ఓత్సల్యంతో ఎన్ని రకాలుగా చెప్పినా కొడుకు వినకపోవడంతో కఠిన శిక్షలు వేసే సన్నివేశాలు నాటక ప్రియులను మైమరిపించాయి. ప్రహ్లాదుడ్ని కొండపై నుంచి విసిరి వేయడం. అగ్నిలో తోసేయడం, ఏనుగుల ముందుకు నెట్టడం వంటి ప్రదర్శనలు కనువిందు చేశాయి. చివరకు విష్ణువు స్తంభం నుంచి నరసింహం అవతారంలో బయటకు వచ్చి హిరణ్యకశ్యపుడు పొట్టచీల్చి వధించడంతో నాటిక ముగిసింది. మహావిష్ణువుగా హరిణి, హిరణ్యకశ్యపుడుగా మధుసూదనరావు, ప్రహ్లాదుడుగా భానుజ అద్భుత నటనలతో మెప్పించారు. ఈ కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్. రాజు, ట్రస్టీలు మల్లీకా మనోజ్, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

6 నుంచి జగన్నాథస్వామి రథోత్సవాలు



భీమునిపట్నం, జూన్ 30 : పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయంలో ఈనెల 6 నుంచి 17వ తేదీ వరకూ స్వామివారి రథోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు రొంపిచెర్ల సింగరాచార్యులు, కృష్ణమాచార్యులు తెలిపారు. ఆదివారం వారు ప్రకటన విడుదల చేశారు. 6న ఉదయం 7.45 గంటలకు స్వామివారి నేత్రోత్సవం, సాయంత్రం ఆరు గంటలకు సుభద్ర, జగన్నాథస్వామి కల్యాణం ఉంటుందన్నారు. 7న ఉదయం 7 గంటలకు వార్షిక తొలి పూజ, అనంతరం రథాంగ పూజ, సుభద్ర, జగన్నాథస్వామి, బలభద్రస్వామి ఉత్సవ మూర్తుల రథాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. 8న ఇంద్రజ్యుమ్న మందిరంలో స్వామివారి వేదపురుషావతారం, 9న మత్స్యావతారం, 10న కూర్మావతారం, 11న వరాహావతారం, 12న శ్రీనరసింహావతారం, 13న వామనావతారం, 14న పరశురామావతారం, 15న రామావతారం, 16న శ్రీకృష్ణావతారం, 17న వైకుంఠ నారాయణావతారంలో భక్తులకు స్వామివారు దర్శనం ఇస్తారని చెప్పారు. 11న సాయంత్రం తోటకూర అమ్మవారి పూజలు జరుగుతాయని, 17న సాయంత్రం స్వామివారి మారు రథోత్సవం ఉంటుందన్నారు.ఉత్సవాల అన్ని రోజులు సాయంత్రం 6 నుంచి ఇంద్రజ్యుమ్న మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.


చంద్రబాబును సన్మానిస్తున్న క్షత్రియ కార్పొరేషన్ నాయకులు

అల్లూరి జయంత్యుత్సవాలకు సీఎంకు ఆహ్వానం

భీమునిపట్నం (రూరల్), జూన్ 30 : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంత్యుత్సవాలకు (జూలై 4) ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆహ్వానించినట్టు క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి కన్వీనర్ గొట్టుముక్కల రఘురామరాజు, కో కన్వీనరు బుద్ధరాజు శివాజీ తెలిపారు. ఆదివారం వారు విజయవాడలో చంద్రబాబును కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈమేరకు వారు ఇక్కడి విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. గత ఏడాది జరిగిన ఉత్సవాలకు చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారని, ఈసారి కూడా ఉత్సవాలకు హాజరుకావాలని కోరామని చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. క్షత్రియ ఎమ్మెల్యేలు, ఎంపీలను కూడా ఉత్సవాలకు ఆహ్వానించనున్నట్టు తెలిపారు. కార్యక్రమం వేదిక ఇంకా ఖరారు కావాల్సి ఉందని తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

తగరపువలస, జూన్ 30 : గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు తగరపువలసకు మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులను పునఃప్రారంభించారు. ఈ పనులను స్థానిక నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్ట సురేష్ మాట్లాడుతూ చిట్టివలస శ్మశాన వాటికకు గేట్లు, రహదారి నిర్మాణానికి గతంలో రూ. 18 లక్షలు విడుదల చేశారని చెప్పారు. అలాగే తగరపువలస మెయిన్ రోడ్డులో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి రూ. 16 లక్షలు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం అన్నిచోట్లా పనులు జరుగుతున్నాయని తెలిపారు. మెయిన్ రోడ్డులో కాలువ పూడిక తీతకు రూ. 14 లక్షలు, కొండపేట వాటర్ ట్యాంకు సమీపంలో పిల్లల పార్కు వద్ద రూ. 16 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని

ఘనంగా సత్యసాయి సేవా సమితి వార్షికోత్సవం


బాబా సామూహికంగా పూజ చేస్తున్న భక్తులు

భీమునిపట్నం, జూన్ 30 : పట్టణంలోని మోతీలాల్ వీధిలో సత్యసాయి సేవా సమితి 22వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు ఓంకార నాదం, సుప్రభాతంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం నగర సంకీర్తన, బాబాకు పాలాభిషేకం, అష్టోత్తర శతనామావళి, పతాకావిష్కరణ చేపట్టారు. ఉదయం 9 నుంచి జిల్లా బాల వికాస్ కో ఆర్డినేటర్ బగం సతీష్ ఆధ్వర్యంలో సత్యసాయి సామూహిక వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా నారాయణ సేవ జరిపారు. సాయంత్రం బాల వికాస్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, సత్యసాయి సేవా సమితుల జిల్లా నాయకుల ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగాయి.

గొట్టిపల్లిలో రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం


సన్యాసిరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఆనందపురం, జూన్ 30 : పదవీ విరమణ చేసిన గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రుత్తల సన్యాసిరావును ఆ గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ హెచ్‌ఎంగా రుత్తల సన్యాసిరావు విద్యాభివృద్ధికి ఎంతగానో పాటు పడ్డారని, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా ఆయన పాత్ర ఎంతో కీలకమన్నారు. 14 ఏళ్ల పాటు ఆనందపురం, గొట్టిపల్లి జడ్పీ పాఠశాలల్లో పని చేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ మిగతా ఉపాధ్యాయులు సన్యాసిరావును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఎస్.ఎస్.సి. శ్రీనివాసరావు, నాయకులు బంటుపల్లి మణిశంకర్‌నాయుడు, సర్పంచ్ జగగీష్, ఎంఈవో గంగరాజు పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌కు సందర్శకుల తాకిడి


తీరంలో సందడిగా కనిపిస్తున్న పర్యాటకులు

భీమునిపట్నం, జూన్ 30 : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. నగరం నలుమూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. కొందరు సాగర కన్య బొమ్మ వద్ద ఫొటోలు తీసుకోగా, మరికొందరు సముద్రంలో స్నానాలు చేస్తూ.. ఇసుక తెన్నెల్లో ఆటలు ఆడుతూ సరదాగా గడిపారు.

మూడు వేల మంది జూపార్కు సందర్శన

ఆరిలోవ : నగరంలోని జూపార్కును 3050 మంది పర్యాటకులు సందర్శించారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 2.78 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

పద్మనాభం-శొంఠ్యాం రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పద్మనాభం, జూన్ 30 : పద్మనాభం-శొంఠ్యాం రహదారిలో పద్మనాభం సచివాలయం వద్ద శిథిలమైన రోడ్డుకు ఎట్టకేలకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. అసంపూర్తిగా రోడ్డును వదిలేసారు అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వచ్చిన వార్తకు ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించారు. ఈమేరకు గోతులు పడిన చోట వెట్ మిక్సర్ వేసి రోలింగు చేశారు. దీంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీక్


త్రిబుల్ ఎస్ రోడ్డులో మురుగునీరు

మద్దిలపాలెం, జూన్ 30 : మద్దిలపాలెం త్రిబుల్ ఎస్ బార్ రోడ్డులో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లీకైంది. దీంతో పైమూత నుంచి మురుగు నీరు రోడ్డు మీదకు పొంగి పొర్లుతోంది. ఆదివారం సాయంత్రం వరకు మురుగు నీరు రావడంతో రోడ్డు బురద నీటితో నిండిపోయింది. మురుగు నుంచి విపరీతమైన దుర్వాసన వస్తుండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.